ప్రజాశక్తి

సోమవారం 15 మే 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





టార్గెట్.. వాసుపల్లి

- దక్షిణంలో వైసిపిని ఓడించేందుకు టిడిపి పక్కా వ్యూహం
- రంగంలోకి శ్రీ భరత్
- ఇప్పటికే కార్యక్రమాల జోరు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసి విజయం సాధించి, ఆ తర్వాత అధికార వైసిపిలోకి గోడదూకిన దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ను రానున్న ఎన్నికల్లో ఎలాగైనా ఓడించాలన్న పట్టుదలతో టిడిపి అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. 'టార్గెట్.. వాసుపల్లి' వ్యూహం అమలు చేస్తోంది.

గత ఎన్నికల్లో గెలుపొందిన తరువాత గణేష్ కుమార్ కండువా మార్చడంతో టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీని ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు రెండేళ్లుగా బాబ్జీ దక్షిణ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ.. పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ఆయన పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని సబ్బవరం మండలానికి చెందినవారు కావడంతో దక్షిణ నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో పార్టీ కార్యకర్తల అభిమానాన్ని పొందలేకపోయారనే విమర్శ ఉంది. ఇదేవిధంగా బాబ్జీ పనితీరు ఉంటే 2024 ఎన్నికల్లో గణేష్

మిగతా 2లో..



ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్



దక్షిణ నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న శ్రీభరత్

భానుడు భగభగ



విశాఖ నగరంలో రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. ఉదయం 9 గంటలు దాటిన తరువాత రోడ్డు మీదకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఆదివారం పూర్తిగా ఇళ్లకే పరిమితమవుతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే మద్దిలపాలెం జంక్షన్‌లోనూ ఆదివారం జన, వాహన సంచారం కానరాలేదు

రైళ్ల గమ్యస్థానాలు కుదింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భద్రతా కారణాల దృష్ట్యా పలు రైళ్ల దంతెవాడలో కొద్ది రోజులు నిలిపివేయ బడతాయని రైల్వే శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 18514 విశాఖపట్నం-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 14న దంతెవాడ వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే 18513 కిరండూల్-విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 15న దంతెవాడ నుంచి బయలుదేరుతుంది. అదేవిధంగా 08551 విశాఖపట్నం-కిరండూల్ రైలు మే 14, 15 తేదీలలో దంతెవాడ వరకే వెళ్తుంది. 08552 కిరండూల్-విశాఖపట్నం రైలు కిరండూల్‌కు బదులుగా దంతెవాడ నుంచి బయలు దేరుతుంది. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఎయుకు జాతీయ స్థాయిలో తొమ్మిదో ర్యాంక్

వార్త మెయిన్‌లో..

ఎంవిపి రైతు బజార్‌లో తనిఖీలు

వార్త 2లో..

అమర్‌నాథ్‌కు గుణపాఠం తప్పదు

వార్త 2లో..



వేట నిషేధం అమల్లో ఉండటంతో భీమిలి తీరంలో ఒడ్డుకే పరిమితమైన బోట్లు

మత్స్యకారుల వల విల

వేట నిషేధ భృతి కోసం ఎదురు చూపు

వార్త 3లో..

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

- ఇప్పటికే రెండు కళాశాలలకు షోకాజ్ నోటీసులు
- పటిష్ట ప్రణాళికలతో ఈసారి మంచి ఫలితాలు
- 'ప్రజాశక్తి'తో ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ అధికారిణి ఉమారాణి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ అధికారిణి ఉమారాణి అన్నారు. ఇప్పటికే విశాఖ నగరంలోని రెండు ప్రముఖ విద్యాసంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు ఆమె తెలిపారు. పటిష్ట ప్రణాళికలతో ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఈసారి విశాఖ జిల్లా విద్యార్థులు మంచి ప్రతిభకనబరిచారన్నారు. కళాశాలల్లోని వసతులు, విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెరిగేందుకు చేపట్టిన చర్యలు తదితర వివరాలను ఆమె 'ప్రజాశక్తి'కి వివరించారు. ఆ విషయాలు ఆమె మాటల్లోనే..

విశాఖ జిల్లా పరిధిలో ఎన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి ? ఈ ఏడాది ఫలితాలు ఎలా వచ్చాయి ?

జిల్లా పరిధిలో 10 ప్రభుత్వ కళాశాలలు, 146 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో గడిచిన విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 50,647 మంది, రెండో సంవత్సరం 42,248 మంది పరీక్షలు రాశారు. మొదటి సంవత్సరంలో 31,957 మంది, రెండో సంవత్సరంలో 29,755 మంది ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాదితో



పోల్చుకుంటే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఈసారి మొదటి సంవత్సరంలో 63 శాతం, రెండో సంవత్సరంలో 70 శాతం ఉత్తీర్ణత నమోదైంది.



సప్లిమెంటరీ పరీక్షల వివరాలు తెలపండి ?

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి మంచి ఫలితాలు వచ్చినప్పటికీ ఎక్కువ మంది విద్యార్థులు బెటర్మెంట్ వైపు మొగ్గు చూపారు. ఈ క్రమంలో 44,522 మంది బెటర్మెంట్

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

పరీక్షకు దరఖాస్తు చేశారు. అదేవిధంగా రెండో సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షకు 18,719 మంది సిద్ధమవుతున్నారు.

ఇంటర్మీడియట్‌లో వృత్తి విద్యా కోర్సులు చదివే వారికి ఉపాధి అవకాశాలు ఎలా ఉన్నాయి?

ఇంటర్మీడియట్ అనంతరం ఎక్కువమంది ఎంసెట్, నీట్ పరీక్షలకు హాజరవుతుంటారు. వారు కాకుండా ఇంటర్ ఒకేషనల్ కోర్సులు ఎంచుకున్న సిఎస్‌సి, ఇటి, ఎంఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యు విద్యార్థులు ఈ కోర్సులు పూర్తయిన వెంటనే ఉద్యోగాల్లో చేరొచ్చు. ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఉపాధి కేంద్రం ద్వారా ఉద్యోగాలు పొందేందుకు సహకరిస్తుంది.

కళాశాలల్లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయి ?

ప్రభుత్వ కళాశాలన్నింటిలోనూ మౌలిక వసతులు బాగున్నాయి. అన్ని సౌకర్యాలూ ఉంటేనే ప్రైవేటు కళాశాలలకు అనుమతులు ఇస్తున్నాం. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నాం.

ప్రైవేటు కళాశాలలకు ఉన్న పరిమితులు ఏమిటి ?

ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలోని ప్రైవేట్ కళాశాలల్లో విశాలమైన తరగతి గదులు ఉండాలి. 40 మంది విద్యార్థులు మాత్రమే గదికి ఉండాలి. నిపుణులైన అధ్యాపకులు, అవసరమైన మౌలిక సదుపాయాలు, టాయిలెట్లు, ల్యాబ్‌లు, ఒకేషనల్ గ్రూపులు నిర్వహించే కళాశాలల్లో టెక్నికల్ ల్యాబ్ కచ్చితంగా ఉండాలి. అంతేకాకుండా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సదుపాయాలు కల్పించేవాటికే అనుమతి ఇస్తున్నాం.

ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు గరిష్ట పరిమితి ఎంత?

ప్రభుత్వం జారీ చేసిన జిఒ ప్రకారం గ్రామ పంచాయతీల స్థాయిలో గరిష్టంగా రూ.15 వేలు, మున్సిపాలిటీలలో గరిష్టంగా రూ.17 వేల 500, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.20 వేలు ఫీజులుగా ఉన్నాయి. అందులో సైన్స్, ఆర్ట్స్ గ్రూపుల మధ్య 2 నుంచి 3 వేల రూపాయల వ్యత్యాసం ఉంటుంది. ఈ ఫీజులకు లోబడే ప్రైవేట్ కళాశాలలు వసూలు చేయాల్సి ఉంటుంది.

టార్గెట్.. వాసుపల్లి

కుమార్‌ను ఓడించడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గణేష్ కుమార్‌కు దక్షిణ నియోజకవర్గం టిక్కెట్‌ను ఖరారు చేస్తూ ఈసరికే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. మత్స్యకార సామాజిక తరగతికి చెందిన ఆయన 2014, 2019 ఎన్నికల్లో వరుసగా రెండు పర్యాయాలు ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజవర్గంపై ఆయనకు మంచి పట్టు ఉంది. పైగా ఈ నియోజకవర్గంలో ఆయన సామాజిక తరగతికి చెందినవారు అధికంగా ఉన్న విషయం తెలిసిందే.

జోరు పెంచిన శ్రీభరత్

టిడిపికి ద్రోహం చేసిన గణేష్ కుమార్‌ను రానున్న ఎన్నికల్లో ఎలాగైనా ఓడించాలని టిడిపి ఎంతో పట్టుదలగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో గీతం విద్యాసంస్థల ఛైర్మన్, టిడిపి విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త ఎం.శ్రీభరత్‌ను రంగంలోకి దించింది. ఈ నియోజకవర్గ ప్రజలతో భరత్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. ఆయన నేరుగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని టార్గెట్ చేస్తూ 'జగన్ పోవాలి-సైకిల్ రావాలి' అనే నినాదంతో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. 'మీకోసం.. మీ భరత్ (ఫర్ ఎ బెటర్ విశాఖ)' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా దక్షిణ నియోజకవర్గంలో ఈ నెల 5 నుంచి పాదయాత్ర నిర్వహిస్తున్నారు. 34వ వార్డులో శ్రీభరత్ చేపట్టిన పాదయాత్రకు ఆశించిన స్థాయిలో స్పందన రావడంతో నియోజకవర్గంలో మిగిలిన అన్ని వార్డులనూ చుట్టుముట్టి ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని నిర్ణయించారు. భరత్‌తో పాటు పార్టీ దక్షిణ ఇన్‌ఛార్జ్ గండి బాబ్జీ కూడా ఈ పాదయాత్రలో పాల్గొంటున్నారు. ఇదంతా చూస్తుంటే, 2024 ఎన్నికల్లో దక్షిణ నుంచి టిడిపి అభ్యర్థిగా శ్రీ భరత్ పోటీలో ఉండే అవకాశం ఉందనే భావన ఆ పార్టీ కార్యకర్తల్లో ఈసరికే ఏర్పడింది. ఇదే నిజమైతే గండి బాబ్జీకి ఈ నియోజకవర్గంలో నుంచి పోటీ చేసే అవకాశం ఉండకపోవచ్చునని అంటున్నారు. పోటీలో ఎవరు ఉన్నప్పటికీ.. ఈ నియోజకవర్గంలో వాసుపల్లి గణేష్ కుమార్ ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవకుండా చూడాలనేదే టిడిపి వ్యూహంగా కనిపిస్తోంది.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బీచ్‌లోని యోగా విలేజ్ వద్ద డాక్టర్ నిహాల్ ఆధ్వర్యంలో కౌసల్య కౌన్సెలింగ్ సెంటర్ వారిచే ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. 50 మందికి ఉచితంగా బిపి, సుగర్ పరీక్షలు నిర్వహించారు. మద్యం వల్ల కలిగే హాని, నివారణ విధానాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఆదివారం ఇటువంటి సేవలు అందిస్తామని డాక్టర్ నిహాల్ తెలియజేశారు.

క్షుద్ర పూజలు చేస్తున్న వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : క్షుద్ర పూజలు చేస్తున్న వారిని అరెస్టు చేయాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సైన్సుపరంగా దేశం దినదినాభివృద్ధి చెందుతున్నా ఇంకా క్షుద్ర పూజలు, మంత్రాల పేరుతో మోసాలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. శనివారం గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన పూజారి చిలకలూరిపేటకు చెందిన మహిళతో కలిసి క్షుద్ర పూజలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే పలువురు యువతులను మోసం చేసి నగ్నంగా పూజలు చేస్తున్న అంశంపైనా విచారణ జరిపి దోషులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో తెలుగు రాష్ట్రాలలో క్షుద్ర పూజల కేసులు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు.

అమర్‌నాథ్‌కు గుణపాఠం తప్పదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నిత్యం జగన్మోహన్ రెడ్డికి భజన చేస్తూ, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను వ్యక్తిగతంగా దూషిస్తున్న రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు రానున్న కాలంలో తగిన గుణపాఠం తప్పదని జనసేన దక్షిణ నియోజకవర్గ నాయకులు పి.శివప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజావ్యతిరేక వైసిపి ప్రభుత్వాన్ని కూల్చడం, ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించడం, వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ తమ పార్టీ లక్ష్యమన్నారు. కొన్ని పార్టీలతో పొత్తులతో రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన పార్టీ భావిస్తే అమర్‌నాథ్‌కు ఉలికెందుకని ప్రశ్నించారు. రాజకీయ పార్టీలకు పొత్తులు కొత్త కాదన్నారు. వైసిపి వ్యతిరేక ఓటు చీలనివ్వం అని పవన్ కల్యాణ్ చెప్పారని, అందులో తప్పేముందని అన్నారు. సమావేశంలో పార్టీ దక్షిణ నియోజకవర్గం నాయకులు ఉసిరికాయల యజ్ఞ శ్రీ, గరికెన రవి, చీకటి రమేష్, నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

'డయల్ యువర్ ఆర్‌డిఒ'తో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ డివిజన్ అధికారి అధ్యక్షతన ప్రతి సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకూ డయల్ యువర్ ఆర్‌డిఓ కార్యక్రమం నిర్వహించనున్నట్టు విశాఖపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు వారి సమస్యలను ఫోన్ ద్వారా 0891-2562977 నెంబర్‌కు తెలియజేయాలని కోరారు. తద్వారా సమస్యలను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేంద్ర నిధులతో రాష్ట్రం సోకులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులుగా ప్రచారం చేసుకోవడం తప్ప సొంతంగా చేసిందేమీ లేదని రాజ్యసభ ఎంపీ జివిఎల్.నరసింహారావు అన్నారు. ఆదివారం ఉదయం బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక పోర్టుకు రావలసిన బల్క్ రైల్వే లైన్‌ను మరికొద్ది రోజులలో పూర్తి చేస్తామని అన్నారు. కేంద్రం ఇచ్చే నిధుల్లో వైసిపి సర్కారు అవినీతికి పాల్పడుతోందన్నారు. ఇప్పటికైనా ఆ పార్టీ ధోరణి మారాలని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ఎం.రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ధనేశ పాల్గొన్నారు.

ఎంవిపి రైతు బజార్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని ఎంవిపి.కాలనీ రైతు బజార్‌లో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. స్టాల్స్‌ను పరిశీలించారు. సౌకర్యాలు, అమ్మకాలపై రైతులతో సంభాషించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్టేట్ అధికారి ప్రసాద్‌తో సమావేశమై రైతుబజార్‌లో ఉన్న వ్యవసాయ ఉత్పత్తులు, వాటి అమ్మకాల తీరుపై సమీక్ష నిర్వహించారు.



రైతు బజారులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

అస్తవ్యస్తంగా రహదారి

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని మాడగడ గ్రామ సమీపంలో ఉన్న రోడ్డు శిథిలావస్థకు చేరింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి మురుగు నీరు నిండి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో, వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి గుండా జనంగుడ, కినంగుడ, మాడగడ, హట్టగుడ గ్రామాలకు చెందిన గిరిజనులు నిత్యం రాకపోకల సాగిస్తుంటారు. వర్షాకాలంలో వర్షపు నీరు నిండి చెరువును తలపిస్తుంది. గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యం బాగోలేనప్పుడు మాడగడ పిహెచ్‌సికి తీసుకు రావాలంటే అంబులెన్స్ కుడా రాలేని పరిస్థితి నెలకొంది. గతంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. గ్రామస్తులు వంతెన నిర్మించాలని కోరినా పట్టించుకోలేదని గిరిజనులు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు, వంతెన నిర్మాణంకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : నగరంలోని ఒడిశాకు చెందిన ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ప్రాంగణంలో జరిగాయి. అధ్యక్షులుగా జెకె.నాయక్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కరుణాకర్ పాధి, ఎన్‌పి.భుయాన్, కార్యదర్శిగా బిమల్ మహంత, కోశాధికారిగా మహేశ్వర్ బెహెరా, సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా సీమా మొహంతి ఎన్నికయ్యారు. వారికి పలువురు అభినందనలు తెలిపారు.



గుత్తులుగా కాసిన పనసకాయలు

విరగ్గాసిన పనసకాయలు

ప్రజాశక్తి -జిమాడుగుల:ఏజెన్సీలోని పెదబయలు పనసకాయలు విరగ్గాశాయి. పనసకాయల సీజన్ వచ్చిందంటే ఆ రుచి చూడకుండా ఉండలేరు. బంధ వీధి గ్రామంలో పనస చెట్టుకు పనసకాయలు విరగ్గాయడంతో పలువురు చూసేందుకు తరలి వచ్చారు.

నేటి నుంచి వేసవి వినోదాలు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు:మండల కేంద్రంలో ఆసరా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో గిరి బాల నేస్తం (వేసవి వినోదాలు) ఈనెల 15 నుండి ఐదు రోజులు వరక ఏర్పాటు చేయనున్నారు. మండల కేంద్రంలో కళ్యాణ మండపం వద్ద జరిగే ఈ కార్యక్రమంలో ఆసక్తి కలిగిన చిన్నారులు పాల్గొని విజయవంతం చేయాలని గిరిజన మహిళ సంఘం మండల కమిటీ సభ్యురాలు సోనియా ఈశ్వరమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, కథలు చెప్పడం, క్విజ్, పాటల పోటీలు, కవిత్వాలు, కనుక్కోండి చూద్దాం తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. పిల్లల జాయినింగ్‌కు పది రూపాయలు రుసుము చెల్లించి పాల్గొనాలని కోరారు.

మత్స్యకారుల వల విల

- ఆటుపోట్ల నడుమ జీవనం
- రెక్కాడితేగానీ డొక్కాడని నిత్య శ్రామికులు
- వేట విరామ సమయంలో సర్కారు సాయం కోసం ఎదురు చూపు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మత్స్యకారులకు వేటే జీవనాధారం. ఉపాధి మార్గం కూడా. వేటాడే సమయంలో జరగరానిది జరిగితే ఆ కుటుంబం రోడ్డున పడాల్సిందే. సూరీడు ఉదయించక ముందే ఇంటి నుంచి బయలుదేరి అసలు తిరిగి వస్తామో, రామో అన్న విపత్కర పరిస్థితుల్లో జీవన యానం సాగించే శ్రామికులే మత్స్య కారులు. ప్రస్తుతం వేట నిషేధం అమలులో ఉండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. మండలం, జివిఎంసి పరిధిలో సుమారు 14 మత్స్యకార గ్రామాలు, ప్రాంతాలు ఉన్నాయి. అటు అన్నవరం మొదలుకొని జివిఎంసి 4వ వార్డు మంగమారిపేట వరకు సుమారు 18 కిలో మీటర్ల తీర ప్రాంతం ఉంది. ఇంజను బోట్లు, తెప్పలు కలిపి దాదాపు 470 ఉన్నాయి.

సాయం కోసం ఎదురు చూపు..

ప్రభుత్వ సాయం కోసం మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు. మత్స్యకార భరోసా కింద వైసిపి ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేలు సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఏప్రిల్ 14 నుంచి జూన్ 15వ తేదీ వరకు 61 రోజుల పాటు వేట నిషేధ కాలంగా ప్రభుత్వం ప్రకటించింది. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే కాలంలో వేట సాగిస్తే పునరుత్పత్తి దెబ్బ తింటుంది గనుక ఆ సమయంలో నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పర్యావరణ పరంగా కూడా ఈ నిర్ణయం సరైందే. అయితే ఆ సమయంలో చేపల వేటపైనా, అనుబంధ రంగాలపైనా ఆధారపడే మత్స్యకారుల ఉపాధి తీవ్రంగా దెబ్బతింటుంది.

విశాఖ జిల్లాలో 12,173 మంది లబ్ధిదారులకు మత్స్యకార భరోసా కింద ఆర్థిక సాయం అందనుంది. ఇందులో భీమిలి మండలంలో దాదాపు 3వేల మంది ఉన్నారు. వీరంతా ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు. మెకనైజ్డ్ బోటుపై 8మంది, మోటరైజ్డ్ బోటుపై ఆరుగురు, తెర చాపపై ముగ్గురు చొప్పున వేటకు వెళ్తారు.



భీమిలి తీరంలో ఒడ్డుకే పరిమితమైన బోట్లు



వేట నిషేధంతో వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు

16న బ్యాంక్ ఖాతాల్లో జమ

రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార భరోసా పథకం కింద మత్స్య కారులకు అందించే రూ.10 వేలు సాయం ఈ నెల 16 నుంచి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయి. మత్స్యకారులెవరూ ఆందోళన చెందనసరం లేదు.



డి.లావణ్య
మత్స్యశాఖ అభివృద్ధి అధికారి
భీమునిపట్నం

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా : వ్యక్తి మృతి

ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట నుంచి రొచ్చుపణుకు వెళ్తున్న ఆటో జెడ్.కొత్తపట్నం గ్రామం వద్ద బోల్తా పడిన ఘటనలో వ్యక్తి మృతి చెందగా మరో ఐదుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో రొచ్చుపణుకు గ్రామానికి చెందిన పోటుకూరి కర్రెన్న మృతి చెందగా కట్టెల రాజమ్మ, తుర్రే లక్ష్మయ్య, చంద్రమ్మ, సోముల దేముడమ్మ, ఉల్లి సింహాచలంలకు గాయాలయ్యాయి. కొత్తకోట పోలీసు స్టేషన్ కు తగువు నిమిత్తం వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయాల పాలైన బాధితులను నర్సీపట్నంలో ఆస్పత్రికి తరలించారు. కర్రెన్న చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొత్తకోట ఎస్ఐ విభీషణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి జోడుగుళ్ళపాలెంలో శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు ఆదివారం ఉదయం కార్పొరేటర్ కొరుకొండ స్వాతిదాసుతో కలిసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి భూమి పూజ నిర్వహించారు. జివిఎంసి నిధులు రూ.55 లక్షలతో రక్షణగోడ, బర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లను నిర్మించనున్నారు. అనంతరం సాగర తీరానికి ఆనుకొని ఉన్న స్థలంలో రూ.20 లక్షలతో రజకులు కోసం దోబీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రూ.25 లక్షలు వెచ్చించి గ్రీనరీని పెంపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, జివిఎంసి ఇంజనీరింగు అధికారులు, వైసిపి నాయకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

న్యాయ పోరాటంలో విజయం జ్యూట్ కార్మికులదే

బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్థనరావు

ప్రజాశక్తి -తగరపువలస : తాత్కాలికంగా ఆర్థిక పరమైన ఇబ్బందులు పడుతున్నప్పటికీ, యాజమాన్యంతో, మరో వైపు యాజమాన్యానికి ఒత్తాసు పలికే ప్రభుత్వంపై జరుపుతున్న న్యాయ పోరాటంలో తుదకు విజయం సాధించేది జ్యూట్ మిల్లు కార్మికులేనని చిట్టివలస జ్యూట్ మిల్లు లాకౌట్ బాధిత కార్మిక సంఘం న్యాయ సలహాదారు, ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.జనార్ధనరావు తెలిపారు. చిట్టివలసలో సంబంధిత కార్మిక సంఘం ప్రతినిధులు, జ్యూట్ కార్మికులతో కలిసి ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యం, నాలుగు కార్మిక సంఘాలు కలిసి ప్రభుత్వంతో గతంలో కుదుర్చుకున్న ఒప్పందం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. యాజమాన్యం కార్మికులకు చట్ట ప్రకారం చెల్లించాల్సిన ఆర్థిక పరమైన సదుపాయాలు వర్తింప జేసేలా న్యాయ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఓ వైపు ఇందుకు సంబంధించి కేసు న్యాయ స్థానంలో ఉంటుండగానే జ్యూట్ యాజమాన్యం, బినామీ పేర్లతో తన ఆస్తులను అమ్మకానికి యత్నించడం సరైంది కాదన్నారు. లాకౌట్ బాధిత కార్మిక సంఘం కోర్టులో వేసిన కేసు విచారణ వేగవంత మవుతున్న దశలో ఈ నెల 11న హైకోర్టు జ్యూట్ యాజమాన్యానికి నాన్ బెయిల్‌బుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసినట్లు వివరించారు. ఈ విలేకర్ల సమావేశంలో కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎన్.అప్పలరాజు, అధ్యక్షులు వివిఎస్ఎ.నరసింహరాజు, కార్యదర్శి జె.వెంకటరమణ, సభ్యులు వై.తాతారావు, గిడుతూరి శ్రీనివాసరావు, జె.రమణ, ఎస్.అప్పారావు పాల్గొన్నారు. కోర్టు తీర్పు పట్ల జ్యూట్ మిల్లు కార్మికులు, కార్మిక సంఘం ప్రతినిధులు హర్షం వెలిబుచ్చారు.

సత్కారం

భీమునిపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎన్ జనార్ధనరావును కార్మిక సంఘం ప్రతినిధులు, జ్యూట్ కార్మికులు ఈ సందర్భంగా సత్కరించారు. శాలువా కప్పి, పుష్ప గుచ్చం అందజేశారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్థనరావు

నేటి నుంచి పైడితల్లమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని కృష్ణాపురంలో 11 సంవత్సరాలు తరువాత గ్రామ దేవత పైడితల్లిమ్మ పండగను తెచ్చారు. దీనిలో భాగంగా సోమవారం తోలేళ్ళ ఉత్సవాలు, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ పండగను పురస్కరించుకొని ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 20 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలు శనివారంతో ముగిశాయి. ఇందులో విశాఖ ఆరిపాకకు చెందిన టీమ్‌నకు మొదటి బహుమతి, సబ్బవరం సమీపంలో ఉన్న చందక టీమ్‌కు రెండో బహుమతి, రాయపాలేనికి మూడో బహుమతి సాధించారు. మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు ప్రకటించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ధ్వజస్తంభం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆదివారం ధ్వజస్తంభ సంప్రోక్షణ నిర్వహించారు. ఆలయ ఇఒ నానాజీ, దేవాలయం కమిటీ ఛైర్మన్ రాజసాగి హరీష్‌కుమార్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992- 93 బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వేములవలస బీపీ కల్లాల రోడ్డులోగల శుభశ్రీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. అప్పటి ఎస్‌పిఎల్ పతివాడ రమణ మాస్టర్, పూర్వ విద్యార్థి ప్రస్తుత ఎస్ఐ బోరపు మంగరాజు, మేసాల రామునాయుడు, దోంతల చిన్న శ్రీను ఆధ్వర్యాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 10వ తరగతి చదువుకొని 30 సంవత్సరాల పూర్తిచేసుకున్న సందర్భంగా అందరూ ఒకచోట కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. భవిష్యత్తులో పలు సేవా కార్యక్రమాలు చేయాలని, సమస్య వచ్చిన వారికి తోడ్పాటునందించి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో ఉన్నవారుర, వ్యాపారం చేస్తున్నవారు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దోంతల మాస్టర్ శ్రీను, కంది సత్తిబాబు, కృష్ణవేణి, బంగారునాయుడు, ఉప్పాడ సీతారాం, గొంతు రమేష్, విజనిగిరి అప్పలనాయుడు, ఉప్పాడ రామిరెడ్డి, సహస్ర పాల్గొన్నారు.



ఒక చోట కలుసుకున్న ఆనందపురం 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై లేఖలు

ప్రజాశక్తి - ఆరిలోవ : 'విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపండి' అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జెఎసి కన్వీనర్ ప్రియాంక దండి ఆధ్వర్యాన తోటగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం ప్రజలతో రాష్ట్రపతికి లేఖలు రాయించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రియాంక దండి మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు భూములిచ్చిన సుమారు 800 మందికి ఉద్యోగాలు ఇవ్వకుండానే ప్రయివేటీకరణ చేయడం అన్యాయమన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 14, 19, 21 హక్కులు కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న స్ట్రేటజిక్ సేల్ నిర్ణయాన్ని ఆపాలని రాష్ట్రపతికి ప్రజలతో లేఖలు రాయిస్తున్నామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి లేఖలు రాస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు నినాదంతో సంపాదించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించకుండా చేస్తున్న ఉద్యమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వైసిపి సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల స్వయంగా పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి సభ్యులు జగన్ మురారీ, నుశ్చల్, నాగరాజు, హర్ష తదితరులు పాల్గొన్నారు.



స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని లేఖలు రాస్తున్న స్థానికులు



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామచంద్రనగర్ కమిటీ ప్రతినిధులు

డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలని వినతి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి రామచంద్రనగర్‌లోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావుకు గ్రామ అధ్యక్షకార్యదర్శులు బలగా రామారావు, డి.రమణ, కమిటీ సభ్యులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ సమస్య ఎమ్మెల్యే నాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి కమిషనర్‌ను కలిసి వేరే చోటకు తరలించడానికి ప్రయత్నం చేస్తామన్నారు. డ్రెయినేజీలు, గెడ్డల పక్కన రోడ్డు, గెడ్డల్లో పూడికలు తీయించాలన్న సమస్యల పరిష్కారానికి కూడా కృషిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాస్కరరావు, ఉమామహేష్, కమలాకర్, వినోద్, దుర్యోధన, రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న కెకె.రాజు తదితరులు

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 43వ వార్డు పరిధి జగన్నాధపురంలో వైజాగ్ సౌండ్స్, లైటింగ్ డెకరేటర్స్ అసోసియేషన్ కోసం నిర్మించిన నూతన సామాజిక భవనాన్ని ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ ఫలాలతో పాటు మౌలిక వసతులు కల్పిస్తూ జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నారని తెలిపారు. ప్రజలకు అన్ని విధాలా అందుబాటులో ఉండే విధంగా సామాజిక నూతన భవనాలను నిర్మిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఆళ్ల లీలావతిశ్రీనివాసరావు, కె.అనీల్‌కుమార్‌రాజు, ఇఇ శ్రీనివాస్, ఎఇ రమణమ్మ, సీనియర్ నాయకులు గంగా మహేష్, హబీబ్, మహాదస్య గోపి, కె.చిన్నా, దాడి శ్రీను, కాళీ ప్రసాద్, వైజాగ్ సౌండ్స్, లైటింగ్ డెకరేటర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


అప్పలనరసింహనగర్ ముఖద్వారం ప్రారంభం

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 94వ వార్డు పరిధి అప్పలనరసింహ నగర్ వద్ద కాలనీ అభివృద్ధి కమిటీ నిర్మించిన ముఖద్వారాన్ని గోపాలపట్నం ట్రాఫిక్ సిఐ కె.అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, ముఖ ద్వారం నిర్మాణానికి హెల్పింగ్ హేండ్స్ వ్యవస్థాపకుడు యతిరాజుల నాగేశ్వరరావు ఎక్కువ మొత్తంలో విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. యతిరాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ, అప్పలనరసింహనగర్ కాలనీని ప్రగతిపథంలో నిలపడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. అప్పలనరసింహనగర్ కాలనీలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని అభివృద్ధి కమిట సభ్యులు సిఐని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హేండ్స్ ప్రధాన కార్యదర్శి కంచిపాటి జగదీష్, కమిటీ సభ్యులు వంకర చినఅప్పారావు, శ్రీనివాసరావు, బల్ల శ్రీనివాసరావు, గంట్ల శ్రీనివాస్, తవిటినాయుడు, కూన రామరాజు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



ముఖ ద్వారం ప్రారంభంలో సిఐ అశోక్‌కుమార్

'కావ్య వైద్యానికి సహకారమందించాలి'



బాలిక తండ్రికి ఆర్థిక సహాయం అందిస్తున్న సీతారాం

ప్రజాశక్తి-సీతమ్మధార : గత కొన్నేళ్లుగా మంచానికే పరిమితమై జిబి సిండ్రోమ్ వ్యాధితో చికిత్స పొందుతున్న ద్వారకానగర్‌కు చెందిన చిన్నారి కావ్య వైద్య ఖర్చులకు రాష్ట్ర ప్రభుత్వం, దాతలు చేయూతనిచ్చి సహకరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కోరారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (సీఆర్‌పీఎఫ్) విశాఖ నగర కమిటీ ప్రతినిధులు సమకూర్చిన రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం ద్వారకానగర్‌లోని వారి ఇంటి వద్ద బాలిక తండ్రి హరికుమార్‌కు సీతారాం అందించారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ గులియన్ బ్యారీ సిండ్రోమ్ (జిబి) అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి వైద్య పరీక్షల్లో వైటల్స్‌గా పిలవబడే నాడీ, రక్త పోటు సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ ఆచేతనత్వంతో ఉంటుందని తెలిపారు. కాళ్ళు, చేతులు, మెడ, కండరాలు, ఒక్కోసారి కళ్లు మూసుకోవడం కష్టతరం అవుతుందన్నారు. ఇప్పటికే రూ.50 లక్షలు అప్పులు చేసి వివిధ ఆసుపత్రుల్లో వైద్యం చేయించారని తెలిపారు. బాలిక వైద్యం కోసం తండ్రి రైల్వే ఉద్యోగానికి సైతం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారని పేర్కొన్నారు. ఆర్థికంగా తట్టుకోలేక వైద్యాన్ని నిలిపేస్తామని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం, దాతలు బాలిక వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని చెప్పారు. దాతలు చిన్నారి తండ్రి ఫోన్ పే నంబర్ 9848323144 లేదా కెనరా బ్యాంక్ అకౌంట్ నెంబర్ 35802010060107, ఐఎఫ్ఎస్‌సి కోడ్ సిఎన్‌ఆర్‌బి 0013580కు ఆర్థిక సాయాన్ని పంపించి పునర్జన్మ ప్రసాదించాలని సీతారాం కోరారు. ఈ కార్యక్రమంలో పట్టా ఫౌండేషన్ అధినేత పట్టా రమేష్, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.శకుంతల, ఫోరం నగర కన్వీనర్ కె.ఎల్లయ్య, సలహాదారు డాక్టర్ ఆదిమూర్తి, కార్యదర్శి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న జియ్యాని

ప్రజాశక్తి-వేపగుంట: సింహాద్రి అప్పన్నను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

వినసొంపుగా ఆనంద్ సంగీతం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్, వాల్తేరు డివిజనల్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా హిందూస్తానీ, కర్నాటక, భజనలు, భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని ప్రదర్శించే ఆనంద్ సంగీతాన్ని నిర్వహించారు. ఉదయం 6:30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం ఆకట్టుకునే భక్తిగీతంతో ముగిసింది. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి మాట్లాడుతూ, డిసిఎ సభ్యుల నైపుణ్యం, ప్రతిభను చాటిచెప్పేందుకు క్లాసికల్ ఈవెంట్‌ను నిర్వహించడం అద్భుతమన్నారు. ఆ సమయంలో శ్రోతలు సంగీతంలో మునిగితేలారని పేర్కొన్నారు. కార్యక్రమం నిర్వహణ కో-ఆర్డినేటర్, ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ పారిజాత సత్పతి పనితీరుకు ఆహుతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులుగా డివిజనల్ కల్చరల్ అసోసియేషన్, వాల్తేరు డివిజన్‌కు చెందిన గాయకులు జివి.సురేష్, కెవి.సురేష్, రణధీర్ కుమార్, ఎన్ఎ.రాజు, ఎం.భారతి, వాయిద్యకారులు యు.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్ సంగీతంలో రైల్వే ఉద్యోగులు

తల్లి తొలి గురువు

ప్రజాశక్తి -ములగాడ : ప్రతి ఒక్కరికీ తల్లి తొలి గురువని, స్నేహశీలి, త్యాగమయి అని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి అన్నారు. మల్కాపురంలోని శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం ఆమె రిసోర్స్ పర్సన్‌గా హాజరై మాట్లాడారు. ఆదివారం మాతృ దినోత్సవం సందర్భంగా 'తల్లిపై తమ భావాలను' చిన్నారులు పంచుకున్నారు. మీ దృష్టిలో తల్లి అంటే ఎవరు ? అనే ప్రశ్నకు చిన్నారులు అద్భుతమైన సమాధానాలు ఇచ్చి ఆశ్చర్యపరిచారు. తల్లి ఒక అనుభూతి అని, ఒక అనురాగమని, త్యాగానికి ప్రతీక అని, సహనశీలి అని, తమ కష్టాలలో భాగం పంచుకునేదని, మన చిరునవ్వుకు కారణమని, మన జీవితానికి ఒక అర్థం అని వారు చెప్పిన సమాధానాలు ఆలోచింపజేశాయి.


ప్రముఖ కార్మిక నాయకులు బి.సత్యానందం మాట్లాడుతూ, వృద్ధాప్యంలో ఉన్న తల్లులను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. అనంతరం చిన్నారులకు వివిధ ఆట పాటల పోటీలను నిర్వహించారు. విజేతలకు జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి బహుమతులను అందజేశారు. 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ తరపున ప్రముఖ సేవా కార్యకర్త సతీష్ చిన్నారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం వేమన శతకంలోని వివిధ పద్యాలను విద్యార్థులు తెలియజేశారు. చందమామలోని వివిధ కథలను చదివి అర్థమయ్యేలా చెప్పారు. ప్రముఖ రచయిత కె.సత్తిరాజు సీనియర్ విద్యార్థులతో కలిసి తయారుచేసిన నౌకను బాలలు ఆసక్తితో తిలకించారు.

వర్షిణికి అభినందనలు

ప్రజాశక్తి-గాజువాక: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంస అందుకున్న శ్రీనాదు వర్షిణిని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు సన్మానించారు. విద్యార్థినికి మిఠాయి తినిపించి అభినందనలు తెలియజేశారు. వార్డులోని సంజీవగిరి కాలనీ సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తున్న శ్రీనాధు శ్రీనివాస్ కుమార్తె వర్షిణి గాజువాక హైస్కూల్‌లో చదువుతూ పది పరీక్షల్లో 600 మార్కులకు గాను 578 మార్కులు సాధించి సత్తా చాటింది. ఈ మేరకు తన కార్యాలయంలో అభినందించి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే కాకుండా విద్యా ప్రమాణాలు పెంపొందించడంలో కూడా అనేక చర్యలు తీసుకుంటుందని, ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన ఉంటుంది అనటానికి పది ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కమిటీ ప్రధాన కార్యదర్శి పెద్దింటి మంగునాయుడు, జానా సతీష్, పెంట్ర రాజు, కెకె.మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

యువగళం సంఘీభావ పాదయాత్రకు తరలిరండి

ప్రజాశక్తి -అనకాపల్లి :నారా లోకేశ్ పాదయాత్రతో జగన్ రెడ్డి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీష్ అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, నారా లోకేష్ యువగళం పాదయాత్ర వందరోజులు పూర్తవుతున్న సందర్భంగా సోమవారం అనకాపల్లి పట్టణంలో సంఘీభావంగా జరిగే పాదయాత్రకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 19వ తేదీన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి పట్టణంలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు పర్యటనను విజయవంతం



మాట్లాడుతున్న గోవింద సత్యనారాయణ

చేయాలని కోరారు. పార్టీ నాయకులు మాధంశెట్టి నీలబాబు, బిసి సాధికార రాష్ట్రకన్వీనర్ మళ్ల సురేంద్ర, బిఎస్ఎంకె జోగి నాయుడు, బొద్దపు ప్రసాద్, పోలారపు త్రినాథ్, కొణతాల రత్నకుమారి, సిరసపల్లి సన్యాసిరావు, ఆళ్ల రామచంద్రరావు, సురే సతీశ్, శంకరరావు, గోపి పాల్గొన్నారు.

నేడు టిడిపి సంఘీభావ యాత్ర

బుచ్చయ్యపేట: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర వందరోజులు పూర్తవుతున్న సందర్భంగా సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు చోడవరం నుండి వెంకన్నపాలెం వరకు సంఘీభావ పాదయాత్ర నిర్వహిస్తున్నటు మండల పార్టీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. మండలంలో పతి గ్రామం నుండి అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైద్యానికి ఎంవిఆర్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి -అనకాపల్లి : హెర్నియా వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఎంవిఆర్ తనయుడు సతీష్ ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. ముత్యాల గార్మెంట్స్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు ఇప్పటికే అనేక సేవాకార్యక్రమాలతో అనకాపల్లి పార్లమెంట్ నియోజక వర్గంలో ప్రభంజనంలా దూసుకుపోతున్నారు. ఆయన చేస్తున్న సామాజిక సేవలలో భాగంగా ఆదివారం నక్కపల్లికి చెందిన వ్యక్తి నరసింగరావుపేటలోని ఎంవిఆర్ కార్యాలయానికి వచ్చి, హెర్నియాతో బాధపడుతున్న తనకు ఆపరేషన్‌కు ఆర్థిక సహాయం అందించాలని అభ్యర్థించాడు. దీనిపై స్పందించిన ఎంవిఆర్ తనయుడు సతీష్ బాధితుని వైద్యానికి అవసరమైన ఆర్థిక సహాయం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తనకు ఆర్థికసాయం అందించిన ఎంవీఆర్‌కు, ఆయన తనయులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

కాంగ్రెస్ విజయోత్సవం



విజయోత్సవాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి -వద్దాది : దేశంలో మోడీ, అమిత్‌షా ప్రభావం తగ్గి, బిజెపి పతనం ప్రారంభమైందనడానికి కర్ణాటకలో కాంగ్రెస్ జయకేతనమే నిదర్శనమనివడ్డాది టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యపురెడ్డి సత్యనారాయణ అన్నారు. బుచ్చయ్య పేట మండలం వడ్డాది జంక్షన్‌లో కర్ణాటకలో కాంగ్రెస్ విజయంపై వేడుకలు జరుపుకున్నారు .ముందుగా రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాటలాడుతూ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ భారీ విజయం సాధించడం హర్షనీయమన్నారు. కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని కన్నడిగులు విశ్వసించి, కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలోనూ కాంగ్రెస్ జయకేతనం ఎగరేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా సత్యసాయి శతజయంతి

ప్రజాశక్తి- కె.కోటపాడు : సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాలలో భాగంగా కె కోటపాడు మండలం కింతాడ పంచాయితీ, కూండ్రపువానిపాలెం శ్రీరామసిద్ధిసాయి మందిరంలో నమామి సాయి శతరుద్రీయం రుద్రాభిషేకం, పూజలు నిర్వహించారు. రావాలమ్మా బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ యజమాని కన్నూరు సూర్యనారాయణ, రామమ్మ దంపతుల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. మందిరం ప్రాంగణంలో గోపూజ చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రశాంతి నిలయ ప్రతాకవిష్కరణ గావించారు. డాక్టరు కోరారు సాయిశ్రీ హరిప్రసాదశర్మ ఆధ్వర్యంలో సాయిలింగేశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆధ్యాత్మిక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు, సంస్థల జిల్లా అధ్యక్షులు వైశ్యరాజు కృష్ణంరాజు, జిల్లా సేవాదళ్ సమన్వయకర్త కశిరెడ్డి అప్పలనాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు కన్నూరు అప్పలనాయుడు, కన్నూరు సూర్యనారాయణ, బండారు నరసింహనాయుడు గంధం సూర్యం, శక్తిమూర్తి,రమామణి, కామరాజు, సాయి లక్ష్మి, అశోక వర్మ, తాతాజీ బండారు అక్కునాయుడు, వెలగల పైడినాయుడు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి

ప్రజాశక్తి- కె.కోటపాడు : పార్టీ పటిష్టతకు జనసైనికులందరూ సమిష్టిగా కృషి చేయాలని పార్టీ మండలనాయకుడు కుంచ అంజిబాబు అన్నారు. ఆదివారము మండల కేంద్రంలో పార్టీ ఆదేశాల మేరకు కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు జనసేన సిద్ధాంతాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

425 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 106వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 440 మంది రోగులు రాగా, 425 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటిఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 296 మందికి ఉచితంగా కంటిఅద్దాలను అందించారు. మరో 95మందికి మందులు అందజేశారు. 55మందికి కంటి ఆపరేషన్లు చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు. అలాగే బ్రాండిక్స్, రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో పదిమంది దాతలు స్వచ్ఛందంగా రక్తం దానం చేశారు. వైద్యశిబిరానికి వచ్చిన వారికి మజ్జిగ, పలహారాలు,



కంటిపరీక్షలు చేస్తున్న నేత్ర వైద్యసిబ్బంది

భోజనం సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ, ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ, బ్రాండిక్స్ ఇండియా సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగాఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించి, స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలవాలన్నదే సంస్థ లక్ష్యమన్నారు.

ఎరుకునాయుడుకు అభినందనలు



నియామకపత్రం అందుకుంటున్న ఎరుకునాయుడు

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఎపి పంచాయతీరాజ్ చాంబర్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులుగా దాడి ఎరుకునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికపై హర్షం వ్యక్తమౌతోంది. ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు. వైబి. రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అనకాపల్లిలో నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచ్‌ల సమావేశం కె.కోటపాడు మండలం చౌడువాడ మేజర్ పంచాయతీ సర్పంచి దాడి ఎరుకునాయుడును పంచాయతీరాజ్ చాంబర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎరుకునాయుడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బృహత్తరమైన బాధ్యతకు న్యాయం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. సర్పంచుల సమస్యలు పరిష్కరానికి కృషి చేస్తానన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు చొరవ చూపిన పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైబి. రాజేంద్రప్రసాద్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, ఉమ్మడి జిల్లాల సర్పంచుల సంఘం అధ్యక్షులు చింతకాయల సుజాత ముత్యాలరావు, పంచాయతీరాజ్ చాంబర్ ప్రధాన కార్యదర్శి బి ప్రతాపరెడ్డి, కార్యదర్శిగా బుర్ర నాగరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. తనను ఎన్నుకున్న సర్పంచులు. ఎంపిటిసిలకు ధన్యవాదాలు తెలిపారు.

సబ్‌వే నిర్మాణానికి అనుమతులపై హర్షం

ప్రజాశక్తి- అనకాపల్లి : సత్యనారాయణ పురం రైల్వే బ్రిడ్జి దిగువున సబ్‌వే నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే అనుమతులు లభించడంపై ఆదివారం సత్యనారాయణపురం పంచాయతీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంపి డాక్టర్ బివి సత్యవతికి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపి సత్కరించారు. కొన్నేళ్లుగా సబ్‌వే ఏర్పాటుకు పలుమార్లు ప్రజాప్రతినిధులకు, రైల్వే అధికారులకు విన్నవించుకున్నా ఎటువంటి స్పందన లేదన్నారు. అనకాపల్లి ఎంపి డాక్టర్ సత్యవతికి సమస్యను విన్నవించగా ఆమె ప్రత్యేక శ్రద్ధతో రైల్వేశాఖ అధికారులతో మాట్లాడి, అనుమతులు మంజూరు



ఎంపీ సత్యవతిని అభినందిస్తున్న స్థానికులు

చేయించడంపై సత్యనారాయణపురం, మూలపేట గ్రామస్థుల తరపున ఎంపిఇసి,, ఇతర నేతలు సభ్యులు, నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా మాతృదినోత్సవం




వస్త్రదానం చేస్తున్న అతిథి దేవోభవ సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్టలో అతిథి దేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మాతృ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధి కూలీలకు వడదెబ్బ నివారణ మందులు, చిన్నారులకు దుస్తులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు అరిపాక కామేశ్వరరావు మాట్లాడుతూ సృష్టిలో స్వార్థం లేని వ్యక్తి మాతృమూర్తి అని, తల్లిదండ్రుల ఆశీస్సులు ఉంటే ఎలాంటి అవరోధాలున్నా విజయాలను సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. మాతృదినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, తల్లుల సేవానిరతిని పిల్లలు గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా పేదలకు వస్త్రదానం చేశారు. మాజీ సర్పంచ్ అద్రాపు వెంకట సత్యవతి, లావణ్య, ఎం రాఘవేంద్రరావు, జోస్ మీరా కనకేశ్వరరావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ఆదర్శ ప్రేమీ మండలి కార్యాలయంలో ఆదివారం మాతృ దినోత్సవం నిర్వహించారు. ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు మాతృదినోత్సవ ప్రాధాన్యతను వివరించారు.

'సదా' సంస్థకు నగదు ప్రోత్సాహకం

నర్సీపట్నం టౌన్: మదర్స్ డే ను పురస్కరించుకొని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ ఎం.పద్మావతి అనకాపల్లికి చెందిన 'సదా' సామాజిక సేవ ప్రతినిధులకు నగదు పారితోషకం అందించారు. స్థానిక నందనవనం పార్కులో జరిగిన ఈ కార్యక్రమంలో పద్మావతి మాట్లాడుతూ, సొంత కుటుంబ సభ్యులే మరణించిన వారిని పట్టించుకోని ఈ రోజుల్లో అనాథలకు దహన సంస్కారాలు చేయడం ఎంతో గొప్ప విషయం అన్నారు. సదా సామాజిక సేవ టీంకు చెందిన ముగ్గురు యువకులు సొంత ఖర్చులతో దహన సంస్కారాలు చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. వీరి సేవను తెలుసుకున్న తాను మదర్స్ డే రోజున పారితోషికం అందించానన్నారు. సదా టీం చీఫ్ ఆర్గనైజర్ తరుణ్ మాట్లాడుతూ, ఎవరైనా అనాథలు రోడ్డు పక్కన, ఆసుపత్రిలో చనిపోయినా దహన సంస్కారాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఈ సేవను కొనసాగిస్తామన్నారు. అనాధల పట్ల ప్రేమానురాగాలు పంచడమే సదా సోషల్ సర్వీస్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సదా టీం సంపత్, చందు, ఏరియా ఆసుపత్రి హెడ్ నర్స్ బాలా త్రిపుర సుందరి, స్టాఫ్ నర్స్ లు విజయలక్ష్మి, రాజేశ్వరి, ఫార్మసిస్ట్ జయరత్నం, సిబ్బంది రామకృష్ణ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న డాక్టర్ పద్మావతి

19న చంద్రబాబు పర్యటనను
విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 19న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు విశాఖపట్నం పర్యటనను విజయవంతం చేయాలని అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల నాయకులు కొణతాల శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన అనకాపల్లి మండల టిడిపి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ, చంద్రబాబు పర్యటనకు ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, మాజీ ఎంపిపి కొణతాల వెంకట సావిత్రి, పచ్చికూర రాము అక్కిరెడ్డి రమణబాబు, తలారి కాశినాయుడు, ఎంపిటిసి సభ్యుడు తోట విజయ్, సర్పంచ్ దుల్ల జగన్నాథం, శెట్టి వెంకటరమణ, చదరం కాశి, అనకాపల్లి మండల టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి- అనకాపల్లి :మేజర్ పంచాయతీ తుమ్మపాల మెయిన్ రోడ్‌లో భక్తాంజనేయ ఆలయం వద్ద ఆలయ కమిటీ, భక్తుల ఆర్థిక సహకారంతో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. 5 వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసి నాయుడు (బాబి), పెంటకోట నాగేశ్వరరావు మాజీ ఎంపీటీసీ సభ్యుడు పెంటకోట నాగేశ్వరరావు, నడిపల్లి గణేశ్వరరావు, అనపరెడ్డి రమణ, అమ్మ వాటర్ ప్లాంట్ ప్రొప్రైటర్ నడిపల్లి బోసు బాబు,గొంతిన రాము, బుదిరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : తిమ్మరాజుపేట గ్రామంలో హనుమాన్ ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సబ్బవరం : రావలమ్మపాలెంలో విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం కెమికల్ కోస్టల్ కారిడార్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి వెంకటరావు దంపతులు ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ-2 చొక్కాకుల గోవింద్ పాల్గొన్నారు. బంగారమ్మ పాలెంలో సర్పంచ్ దాడి లావణ్య కన్నంనాయుడు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



ఎంపి సత్యవతిని సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

ప్రజాశక్తి -అనకాపల్లి : జివిఎంసి విలీన గ్రామం కొత్తూరు నరసింగరావు పేటలో మోదకొండమ్మఉత్సవాల సందర్భంగా అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు కుంకుమలతో విశేష పూజ గావించి మంగళ హారతి, నీరాజనాలు అర్పించి అమ్మ ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ అనిల్, వైసిపి నేతలు ఎ.అప్పారావు, కరణం సురేష్, రమణ, జి.అప్పారావు పాల్గొన్నారు.

డాక్టర్ మురళీకృష్ణ మరణంతో
మునగపాకలో విషాదఛాయలు



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



డాక్టర్ మురళీకృష్ణ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- మునగపాక రూరల్: రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రం మునగపాక గ్రామానికి చెందిన ప్రైవేట్ వైద్యుడు డాక్టర్ మళ్ల మురళీకృష్ణ(42) మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కరోనా కష్టకాలంలో విశేషసేవలు అందించిన మురళీకృష్ణ అకాలమరణాన్ని కుటుంబీకులతో పాటు స్థానికులు జీర్ణించు కోలేకపోతున్నారు. వివరాలు పరిశీలిస్తే వైద్యవృత్తిలో భాగంగా శనివారం ఇంటి నుండి బయలుదేరిన డాక్టర్ మురళీకృష్ణ రాంబిల్లి మండలం సెజ్ ప్రాంతంలోని సుందరం ఎల్లాయిస్ పరిశ్రమకు రోడ్డుమార్గంలో వెళ తుండగా, డివైడర్‌ను బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రగాయాలపాలయ్యాడు, క్షతగాత్రుడిని అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి మృత్యువాత పడినట్లు రాంబిల్లి ఎస్ఐ దీనబంధు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం ఆదివారం ఉదయం మురళీకృష్ణ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. మురళీకృష్ణ భార్య పుష్పతో పాటు కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది. కరోనా సమయంలో విశేష వైద్య సేవలు అందించి పలువురి మన్ననలు పొందిన మురళీకృష్ణ అకాల మరణం గ్రామంలో పలువురిని కలచివేసింది. మురళీకృష్ణకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని తండ్రి మళ్ల సంజీవరావు మాజీ జెడ్‌పిటిసి.

ఎమ్మెల్యే, ఇతర ప్రముఖుల సంతాపం

రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు వైద్యుడు మురళీకృష్ణ మృతి సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే యువి రమణమూర్తిరాజు (కన్నబాబు) మునగపాక చేరుకొని మృతుని కుటుంబసభ్యులను ఓదార్చి, పరామర్శించి సంతాపం తెలిపారు. ఏపి గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపిపి మళ్ల జయలక్ష్మి, తదితరులు డాక్టర్ మురళీకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు.

ఉల్లాసంగా వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు



మునగపాకలో చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు



నక్కపల్లిలో పద్య పఠనంపై శిక్షణనిస్తున్న ఆచార్యులు

ప్రజాశక్తి -మునగపాక రూరల్: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎల్‌వి. రమణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పిల్లా జగదీష్ పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గొలుగొండ:స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం గ్రంథాలయ అధికారి రాజుబాబు ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ శిబిరంలో ఆదివారం బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, పద్యముల పోటీ, డాన్స్ కాంపిటీషన్ నిర్వహించారు. విశ్వనాథుని రాజబాబు విద్యార్థులకు గణితంలో సులువు పద్ధతులను వివరించారు.

నక్కపల్లి:మండలంలో చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి కె.జనార్ధన్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు పద్య పఠనంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నక్కపల్లి హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు చిన్నారులకు పద్యపఠనంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు పద్యపఠనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్యులు మాట్లాడుతూ, పద్యపఠనంతో మానసిక వికాసంతో పాటు ఏకాగ్రత లభిస్తుందన్నారు. ధారణాశక్తితో చక్కని ఆరోగ్యం కలుగుతుందన్నారు. బాల్యం నుండే పద్యపఠనం పై ఆసక్తి కలిగించేలా సెలవు రోజులలో ఇంటివద్ద తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు అప్పలరాజు, తంగెళ్ళ రవి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి వి. శిరీష తెలిపారు. క్విజ్ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



సబ్బవరంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి- రాంబిల్లి : మండలంలోని లాలంకోడూరులో లాలం చందు ఆధ్వర్యంలో కళాసీల సంఘం అధ్యక్షుడు రుత్తల గణేష్‌తోపాటు టిడిపి, వైసిపికి చెందిన సుమారు 200మంది కళాసీలు జనసేనలో చేరారు. అలాగే నేవీ కాలనీలో మరో 50మంది జనసేన తీర్థం పుచ్చుకున్నారు. జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీరు జనసేనలో చేరారు. కార్యక్రమంలో జనపరెడ్డి శ్రీనివాసరావు, బయలుపూడి శ్రీరామదాసు, పవన్ విజయ్, పప్పల నూకన్న దొర, గొర్లి నాని, భూపతి అప్పలనాయుడు, సుందరపు లోవరాజు, సర్వేశ్వరరావు, రుత్తల శ్రీను, బోలెం రాంబాబు, లాలం గంగాధర్, జాగారపు కేశవ్, లాలం రామారావు, రుత్తల నరేష్ పాల్గొన్నారు



పోలీస్ అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న ఎసిపి మూర్తి

విమ్స్‌లో పోలీస్ అవుట్ పోస్టు

ప్రజాశక్తి - ఆరిలోవ : విమ్స్ ఆసుపత్రి ఆవరణలో పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేశారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎసిపి మూర్తి ఆదివారం పోలీస్ అవుట్ పోస్టును ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్షతగాత్రుల అవసరార్థం, వారి వివరాలు త్వరితగతిన నమోదు చేసుకొని మెరుగైన వైద్యం నిమిత్తం ఈ అవుట్ పోస్టును ఏర్పాటుచేసినట్లు ఎసిపి మూర్తి తెలిపారు.

పర్యావరణ హిత జీవనశైలిపై అవగాహన

ప్రజాశక్తి - మోతుగూడెం : పర్యావరణ హిత జీవనశైలిపై మండలంలోని పలుగ్రామాల్లోని గిరిజనులకు ఆదివారం అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు. చింతూరు ఇన్‌ఛార్జి డిఎఫ్ఓ సౌజన్య ఆదేశాల మేరకు లక్కవరం అటవీక్షేత్రాధికారి కొండలరావు పర్యవేక్షణలో లక్కవరం, సుక్కుమామిడి, దబ్బగూడెం సెక్షన్స్ పరిధిలోని సుక్కుమామిడి, లక్కవరం, సిరసనపల్లి, గొడ్లగూడెం, గోపాలపురం, దబ్బగూడెం గ్రామాల్లో ఆదివారం మిషన్ లైఫ్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

బిజెపి నిరంకుశ విధానాలపై
ఐక్య ఉద్యమం

ప్రజాశక్తి-విఆర్ పురం : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, దుర్మార్గాలపై నిలదీసి ఉద్యమించాల్సిన అవసరం ఉందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు పిలుపునిచ్చారు. ఆదివారం రేఖపల్లిలో నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ, బిజెపి విధానాలతో ప్రజాస్వామ్యానికి పెనుముప్పు పొంచి వుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మధ్య మతవిద్వేషాలను రెచ్చగొట్టడంతోపాటు, దేశ సంపదను, ప్రభుత్వరంగ సంస్థలను ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసి, దేశాన్ని గుల్ల చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ అండదండలతో ఆదానీ ప్రపంచానే మోసం చేసి ఎన్ని లక్షల కోట్లను కొల్లగొట్టారో హిండెన్‌బర్గ్ నివేదిక ప్రపంచానికి బహిర్గతం చేసిందని, అయినా ఆదానీపై చర్యలు చేపట్టకపోగా, వెనుకేసుకు రావడం కేంద్రంలోని మోడీ ప్రభుత్వ అరాచకాలకు పరాకాష్ట అన్నారు.

దేశంలోని అడవులు, గనులు, భూములు వంటి సహజ వనరులతోపాటు సర్వస్వాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి ప్రజలకు తీవ్ర అన్యాయం చేయడంతోపాటు దేశమునుగడకే ముప్పు వాటిల్లే చర్యలు చేపట్టిన మోడీ ప్రభుత్వం, ధరలు, పన్నుల మోతతో సామాన్యుని జీవనం దుర్భరం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.స్వాతంత్ర్య సముపార్జనకు బ్రిటీషర్లపై చేసిన జాతీయోద్యమ స్ఫూర్తితో ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ పూనం. సరోజిని, పార్టీ నేతలు పంకు సత్తిబాబు, పొడియం. శ్రీరామమూర్తి, కారం. సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు


ఇంటర్‌లో ప్రవేశాలకు
దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం సిఇసి, హెచ్ఇసి గ్రూపుల్లో ప్రవేశాలు పొందడానికి విద్యార్థుల నుంచిదరఖాస్తులు స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సాయిరాం వెల్లడించారు.

ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆయా గ్రూపుల్లో చేరేందుకు పదో తరగతి మెమోతోపాటు విద్యార్థి తల్లి బ్యాంక్ అకౌంట్, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, విద్యార్థి రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో నేరుగా కళాశాలను సంప్రదించి, ప్రవేశాలు పొందవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సాయిరాం సూచించారు

డ్వాక్రా మహిళలకు అందని ఆసరా

సిఎం బటన్ నొక్కి రెండు నెలలు కావొస్తున్నా ఖాతాల్లో జమ కాని నగదు



ప్రజాశక్తి-గొలుగొండ:నవరత్నాలు అమలు చేయడంలో తమకు తామే సాటి అని చెప్పు కుంటున్న ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా సంఘాలు) మహిళలకు పూర్తిస్థాయి న్యాయం చేసేటట్లుగా కనిపించ లేదు. నవరత్నాలలో ఒక పథకమైన ఆసరా లబ్ధిదారులకు మార్చి 25న ముఖ్యమంత్రి డ్వాక్రా మహిళల ఖాతాలకు సొమ్ము జమ చేయడానికి బటన్ నొక్కారు. ప్రస్తుతం నర్సీపట్నం నియోజకవర్గంలోని గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం, నర్సీపట్నం నర్సీపట్నం మున్సిపాలిటీకి చెందిన డ్వాక్రా గ్రూపుల్లో 30 శాతం గ్రూపులకు నేటికీ ఆసరా సొమ్ము ఖాతాలకు జమ కాలేదు. వాస్తవానికి ప్రభుత్వం దగ్గర సొమ్ము లేకపోవడంతో మిగిలిన డ్వాక్రా మహిళలకు మూడవ విడత ఆసరా సొమ్ము జమ కానట్లు తెలుస్తోంది.

నర్సీపట్నం నియోజకవర్గంలో 5,227 సంఘాలకు చెందిన 55,973 సభ్యులకు రు.118.86 కోట్ల రూపాయలు మూడో విడత ఆసరా పథకం కింద మంజూరయ్యాయి. నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల్లో 1560 సంఘాల ఖాతాలకు ఆసరా పథకం సొమ్ము ఇప్పటివరకు జమ కాలేదు. దీంతో ఈ సంఘాలలో ఉన్న సుమారు 16 వేల మంది సభ్యులు ఆసరా సొమ్మును నోచుకోలేదు. నర్సీపట్నం నియోజకవర్గంలో గొలుగొండ మండలంలో లింగంపేట, నాగాపురం, పుత్తడి గైరంపేట, పాత మల్లంపేట, కొంకసింగి, స్థానిక మల్లవరం గ్రామాల్లో 220 సంఘాలకు, మాకవరపాలెం మండలంలో 150 సంఘాలకు, నాతవరం మండలంలో మన్యపరట్ల, చమ్మసింత, వైబి అగ్రహారం, మాధవ నగరం తదితర గ్రామాల్లో 300 సంఘాలకు నర్సీపట్నం రూరల్‌లో చెట్టుపల్లి, ఓఎల్ పురం తదితర గ్రామాల్లో 180 సంఘాలకు, నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో 200 సంఘాలకు ఆసరా సొమ్ము ఖాతాల్లో ఇంకా జమ కాలేదు. సొమ్ము సంఘాల ఖాతాలకు ఎందుకు జమకాలేదో వివరాలను ఏ అధికారులు చెప్పలేక పోతున్నారు.

ఎస్సీ, ఎస్టీ, బిసి, ఓసి, మైనారిటీ కార్పొరేషన్ల నిధులనే ఆసరా పథకానికి ప్రభుత్వం మళ్ళిస్తుందని, అందులో భాగంగానే ఎస్సీ, ఎస్టీ, కొన్ని బీసీ సంఘాలకు ఆసరా



సొమ్ము ఇవ్వడంతో కార్పొరేషన్ లో నిధులు పూర్తిగా అయిపోయాయని, ఓసి కార్పొరేషన్ లో నిధులు లేనందునే ఓసి సంఘాలకు ఆసరా పథకం సొమ్ము ఒక్క రూపాయి కూడా వారి ఖాతాలకు జమ కాలేదని తెలిసింది. మిగిలిన ఆసరా పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం నిధులు ఎప్పుడు మంజూరు చేస్తుందోనని వారంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.

పిచ్చికుక్కల స్వైర విహారం

రెండు రోజుల్లో 31 మందికి గాయాలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో ఏకైక మేజర్ పంచాయతీ ఏఎల్‌పురం గ్రామంలో శని, ఆదివారాల్లో 31 మంది కుక్కకాటుకు గురయ్యారు.గ్రామంలో పిచ్చికుక్కల స్వైర విహారం చేసి పలువురుని రెండు రోజులు గాయపరిచాయి. గాయపడిన వారిలో చిన్నారులు, మహిళలు అధికంగా ఉన్నారు. ఆదివారం ఉదయం కొంతమంది చిన్నారులను పిచ్చికుక్కలు గాయపరచడంతో తప్పని పరిస్థితుల్లో యువకులు కలిసి ఒక పిచ్చి కుక్కని వెంటాడి హత మార్చారు. ఆ సమయంలో యువకుల సైతం కుక్కకాటుకు గురి కావాల్సి వచ్చింది. గ్రామంలో సుమారు 60 మంది వరకు రెండు రోజుల్లో పిచ్చి కుక్కలు గాయపరిచాయని బాధితులు తెలిపారు. పంచాయతీలో కుక్కల విచ్చలవిడిగా సంచరిస్తూ పలువురిని గాయాలుపాలు చేస్తున్నాయని వాటిని నిరోధించాలని పంచాయతీ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకు వెళ్లప్పటికి ఏ విధమైన చర్యలు చేపట్టలేదని పలువురు గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కుక్కలను అదుపు చేసి ప్రజలను రక్షించాలని పలువురు కోరారు.




ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలు

అపారిశుధ్యానికి కేరాఫ్..

మండల పరిషత్ కార్యాలయం

- బహిరంగ మలవిసర్జనకు నిలయంగా కార్యాలయ ఆవరణ
-పలు అసాంఘిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాలలో ఎటువంటి అపారిశుధ్యానికి తావు లేకుండా గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలక భూమిక పోషించే మండల పరిషత్తు కార్యాలయం.. ఆవరణ ప్రస్తుతం అపారిశుధ్యానికి అడ్డాగా దర్శనమిస్తుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ కార్యాలయ ఆవరణలో మండల విద్యాశాఖ కార్యాలయం, గ్రామీణ ఉపాధి హామీ, వెలుగు కార్యాలయం, పశు వైద్యశాల, శాఖ గ్రంథాలయం, ఉప ఖజానా కార్యాలయంతో పాటు పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, గృహ నిర్మాణ శాఖ, ప్రాజెక్టు ఇంజనీర్ కార్యాలయాలతో పాటు భవిత కేంద్రం, పౌర సరఫరాల గడ్డంగి కూడా ఈ ఆవరణలో ఉన్నాయి. వివిధ పనులపై నిత్యం ఈ కార్యాలయాలకు ప్రజాప్రతినిధులు సహా వందలాదిగా ప్రజలు వస్తూ ఉంటారు. ఈ కార్యాలయ ఆవరణలకు ఉండే ప్రధాన గేట్లు రెండు కూడా ధ్వంసం కావడంతో కార్యాలయ ఆవరణలో పలు అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోవడంతో పాటు



మండల పరిషత్ కార్యాలయం

మలమూత్ర విసర్జన, బహిరంగ మలవిసర్జనకు నిలయంగా మారింది. కార్యాలయ పని వేళల్లో కూడా యధావిధిగా పలు అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. కార్యాలయ పరిసరాలన్ని అపరిశుధ్యానికి అడ్డాగా మారడం మాత్రమే కాదు దుర్గంధ భరితం తయారయింది. అయినా ఇటు సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. అంతేకాకుండా వర్షం వస్తే కార్యాలయ ఆవరణలోకి రోడ్డుపై నుండి నీరు కార్యాలయంలోకి ప్రవేశిస్తుంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రధాన ద్వారాలకు గేట్లు ఏర్పాటు చేయడంతో పాటు కార్యాలయ ఆవరణ పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కార్యాలయం ఆవరణలో బహిర్భూమికి వెలుతున్న వ్యక్తి

లోకేష్‌కు మద్దతుగా పాదయాత్ర

- మాజీ మంత్రి అయ్యన్న



ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:తెలుగుదేశం నాయకులు నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా సంఘీభావం తెలుపుతూ నర్సీపట్నంలో పాదయాత్ర చేపట్టాలని మాజీమంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపు నిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఊహించని విధంగా ఇప్పటి వరకు విజయవంతంగా సాగిందని, వంద రోజులు పూర్తి చేసుకొని 1250 కిలోమీటర్లు పాదయాత్ర చేశారన్నారు. ఆయనకు సంఘీభావం తెలుపుతూ మద్దతుగా పాదయాత్ర చేపడుతున్నట్లు వివరించారు. తుగ్లక్ జగన్ ఎన్ని అడ్డంకులు సృష్టించినప్పటికీ ఎదుర్కొంటూ వంద రోజులు పూర్తి చేశారని, అందుకు మద్దతుగా స్థానిక పెద్ద చెరువు వద్ద ఉన్న మరిడిమాంబ ఆలయం వద్ద సోమవారం ఉదయం అమ్మవారికి పూజలు నిర్వహించి ఆర్యవైశ్య వీధిలో పాదయాత్ర ప్రారంభిస్తామన్నారు. మేదర వీధి మీదుగా అబీద్ సెంటర్‌కు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పించి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దుర్గ గుడిలో పూజలు నిర్వహించి పాదయాత్రను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని అభిమానులు కార్యకర్తలు, నాయకులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



హాజరైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-గొలుగొండ:జోగుంపేటలో 1997-98 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తరువాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం వేడుకగా పూర్వ విద్యార్థుల కలయికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పూర్వ ఉపాధ్యాయులు ప్రకాష్, సింగంపల్లి అప్పలరాజులు హాజరయ్యారు. పూర్వ విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ, పాఠశాలతో, విద్యార్థులతో ఎంతో విడదీయరాని బంధం అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కలవడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం విద్యార్థులు తీపి గుర్తులను నెమరు వేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో పండా శ్రీను, గాదె. హేము, గాదె శివ కృష్ణ, కక్కిరాల నాగేశ్వరరావు, అనిమిరెడ్డి మారుతి నాయుడు, సాయం వెంకటలక్ష్మి బైపురెడ్డి సురేష్, రాయపురెడ్డి శివ, విద్యార్థులు పాల్గొననారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో పాములవాక గ్రామంలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ చిరంజీవిరావు, జిల్లా టిడిపి అధ్యక్షులు నాగ జగదీశ్వరరావు, తెలుగు మహిళ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత పాల్గొని విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు ఎన్టీఆర్ తెలుగు జాతికి చేసిన సేవలను, ఆయన ప్రవేశ పెట్టిన పలు సంక్షేమ పథకాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లాలం కాశి నాయుడు, వేచలపు జనార్ధన్, బికె పల్లి సర్పంచ్ లింగన్న నాయుడు, రాజుపేట సర్పంచ్ బివి రమణ, పలువురు ఎంపిటిసి సభ్యులు, మాజీ సర్పంచులు, టిడిపి నాయకులు భాస్కరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోడ్డు విస్తరణ బాధితులు

రోడ్డు విస్తరణ బాధితులకు
నష్టపరిహారమే ఇవ్వాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నర్సీపట్నం రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోతున్న బాధితులకు పరిహారమే చెల్లించాలని పలువురు డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణ బాధితుల అసోసియేషన్ ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితులు మాట్లాడుతూ, రోడ్డు విస్తరణలో నష్టపోతున్న వారికి టిడిఆర్ బాండ్లు వద్దని, నష్టపరిహారమే చెల్లించాలని అసోసియేషన్ బిల్డింగ్ వద్ద ప్లకార్డులతో నిరసన చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రోడ్డు విస్తరణ చట్ట పరంగా లేదని మాస్టర్ ప్లాన్ డిడిసిపిలో చూసినట్లయితే ప్లాన్ అప్రూవల్ లేదని ప్రపోస్డ్ ప్లాన్ అని ఉందన్నారు. అధికారులు చట్టపరంగా రోడ్డు విస్తరణ చేయలేదన్నారు. ఎలమంచిలి మున్సిపాలిటీ ప్లాన్‌ను పరిశీలిస్తే అప్రూవల్ గా ఉందన్నారు. 15 రోజుల్లో రోడ్ల విస్తరణ చేపడుతున్నట్లు వస్తున్న వార్తలను విని వ్యాపారస్తులు, భవన యజమానులు ఆందోళన చెందుతున్నారని షాపులు ఖాళీ చేయాలంటే సుమారు మూడు నుంచి ఆరు నెలలు సమయం కావాల్సి ఉంటుందన్నారు. సమయం ఇవ్వకుండా 15 రోజుల్లో ఖాళీ చేయాలంటే ఎలా అని ప్రశ్నించారు. తమకు టిడిఆర్ బాండ్లు వద్దని 80 అడుగులు విస్తరణ చేపడితే ఎటువంటి బాండ్లు నష్టపరిహారం కూడా వద్దని చెప్పామని గుర్తు చేశారు. తాము 14 అంశాలను మున్సిపాలిటీలో వివరించామని తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని తెలిపారు. షాపులు ఖాళీ చేయాలంటే ఎంతో మంది నష్టపోతున్నామని, తాము బతకాలని, ఈ షాపులపైనే తమ జీవనం ఆధారపడి ఉందన్నారు. నర్సీపట్నంలో రోడ్ల విస్తరణకు తాము సహకరిస్తామని 100 అడుగుల నుంచి 80 అడుగులకు చేయాలని కోరారు. ఎమ్మెల్యే, పాలకమండలి పున:ఆలోచించాలని తెలిపారు.

గిరిజన సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-జి.మాడుగుల:గెమ్మెలి పంచాయతీ గొడుగురాయి గ్రామంలో సీనియర్ నాయకుడు వి. పిన్నంనాయుడు గిరిజన సంఘం జెండాను ఆవిష్కరణ చేసిన అనంతరం గిరిజన సంఘం 8వ మండల మహాసభను నిర్వహించారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పి.లక్కు పర్యవేక్షణలో ఎస్.ధర్మన్నపడాల్ అధ్యక్షతన నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణపై ప్రణాళిక సిద్ధం చేశారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా వనుగు సన్యాసి దొర, మండల కార్యదర్శిగా కొటారి కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా పాంగి వెంకటరావు, వంజారి పిన్నంనాయుడు, అరగడ శ్రీలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో పదిమంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.అనంతరం నూతన అధ్యక్ష,కార్యదర్శులు సన్యాసి దొర, కోటేశ్వరరావు మాట్లాడుతూ, మండలంలో గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు, తాగునీరు, పోడుభూమి పట్టాలు ఇతర మౌళిక సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.

జాతరలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -సీలేరు: మోదకొండమ్మ జాతర పురస్కరించుకొని ఎన్‌జిఒ హోం వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డికె. హిమబిందు అన్నారు. ఆదివారం జాతర ప్రారంభం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో 152 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. . ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు ప్రజాశక్తి మాట్లాడుతూ, జాతరకు వచ్చే ప్రజలకు వైద్య సేవలు అందించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ఈ నెల 16న జాతర ముగిసే వరకు వైద్యశిబిరాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

శిథిలావస్థలో వంతెనలు

భయాందోళనలో వాహనదారులు, పాదచారులు

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ, కొయ్యూరు మండలాలను కలుపుతూ ఉన్న పురాతన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా కృష్ణదేవిపేట, చీడిగుమ్మల, గుజ్జుమానుపాక, పెదమాకవరం తదితర వంతెనలు శిథిలావస్థలో ఉన్నాయి. దీంతో, ఇటుగా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు భయాందోళన చెందుతున్నారు. కృష్ణదేవిపేట, గుజ్జుమనుపాకల, చీడిగుమ్మల వంతెనలను నిర్మించి ఎనిమిదిన్నర దశాబ్దాలకు పైగా అవుతోంది. వీటికి మరమ్మత్తులు చేపట్టక పోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ వంతెనలు బలహీన పడటానికి కారణం గతంలో వీటికి సమీపంలో ఇసుక తవ్వకాలు జరగడమేనని తెలుస్తోంది. నిత్యం మైదాన, ఏజెన్సీ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వందలాది ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు ఈ వంతెనల మీదుగా వెళుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగు తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పెదమాకవరం తదితర వంతెనల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

అనకాపల్లి జిల్లా తూర్పుగోదావరి జిల్లాల సరిహద్దులను కలిసే ఈ వంతెనలు కూలితే వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. కృష్ణదేవిపేట వంతెన నుంచి రాకపోకలు నిలిచిపోతే గమ్య స్థానాలకు చేరాలంటే అదనంగా మరో 10 కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. పెదమాకవరం వంతెన నుంచి రాకపోకలు నిలిచిపోతే కృష్ణదేవిపేట నుంచి చింతపల్లి, పాడేరు తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే 50కిలో మీటర్ల దూరం ప్రయాణించి నర్సీపట్నం మీదుగా వెళ్లాల్సి వస్తుంది. చీడిగుమ్మల వంతెన కూలితే కృష్ణదేవిపేట, ఏళేశ్వరం ప్రయాణికులు నాతవరం మీదుగా 20 కిలో మీటర్లు అదనంగా ప్రయాణించి నర్సీపట్నం రావలసి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వంతెనల మరమ్మత్తులకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దీనిపై ఆర్అండ్‌బి ఏఈఈ ప్రసాద్ వివరణ కోరగా కృష్ణదేవిపేట, గుజ్జుమనుపాకల, చీడిగుమ్మల వంతెనలను 1936లో నిర్మించగా మరో పదేళ్ల గడువు ఉందన్నారు. వీటికి మరమ్మత్తులు చేపట్టాల్సి ఉందన్నారు. దీని కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. రామరాజుపాలెం వంతెన స్థానంలో కొత్తగా వంతెన నిర్మాణం చేపడు తున్నామని చెప్పారు. పెదమాకవరం వంతెనను కూల్చి వేసి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొత్త వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు.



కేడీపేట వద్ద ఉన్న బొడ్డేరు వంతెన



శిథిలావస్థలో ఉన్న గుజ్జుమానుపాకల వద్ద పిల్లర్లు



కూలడానికి సిద్ధంగా ఉన్న వంతెన ఫిల్లర్

మోదకొండమ్మ ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు

-ఉత్సవ విగ్రహం, పాదాలు ఊరేగింపు - శతకంపట్టులో ప్రత్యేక పూజలు



డప్పులు వాయిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్:పాడేరులో మోదకొండమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను శతకంపట్టులో కొలువుదీర్చడంతో మూడు రోజుల ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అమ్మవారిని శతకంపట్టు వద్దకు తీసుకువెళ్లేందుకు వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ఉత్సవ విగ్రహాన్ని శిరస్సుకెత్తుకొని ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. తరువాత ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, జెసి జె.శివ శ్రీనివాసు, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, జడ్‌పి చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ నర్సింగరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పిన్నయ్యదొర, కొట్టగుళ్లి సుబ్బారావు, నవర కొండబాబు ఉత్సవ విగ్రహం, పాదాలను తలకెత్తుకున్నారు. ఆలయం నుంచి ఊరేగింపుతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, పాదాలను మెయిన్ బజార్ వద్ద ఏర్పాటు చేసిన సంతకంపట్టుకు తీసుకు వచ్చి కొలువుదీర్చారు. ఊరేగింపులో డప్పు వాయిద్యాలు ఆకర్షణగా నిలిచాయి.ఊరేగింపు ముందు భాగాన నృత్యాలు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్, జెసి, ఐటిడిఎ పిఒ, ఎమ్మెల్యే, జడ్ పి చైర్మన్, ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ తదితరులు గిరిజన సంప్రదాయ నృత్యం దింసా నృత్య ప్రదర్శన చేసి ఉత్సాహపరిచారు. శతకంపట్టు వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తి, పాదాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తుల తాకిడితో శతకంపట్టు వద్ద రద్దీగా మారింది. జిల్లాతో పాటు వేర్వేరు. జిల్లాల నుంచి కళాకారులు తరలివచ్చారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్‌పి అతుల్ సిన్హా, ఎఎస్‌పి ధీరజ్ కునుబిల్లి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

శతకంపట్టులో పూజలు

ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శతకంపట్టులో కొలువు తీరిన మోదకొండమ్మకు అధిక సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. మూడు రోజులపాటు ప్రత్యేకంగా ఇక్కడే పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాలు ఆఖరి రోజు మంగళవారం శతకంపట్టులో ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, పాదాలను పట్టణ వీధుల్లో భారీగా ఊరేగించి, తిరిగి ఆలయంలో చేరుస్తారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన భక్తులు శతకంపట్టులో, ఆలయంలోని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో మాజీ మంత్రి మణికుమారి, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, మాజీ ఎంపిపి ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్నివాల్ ను ప్రారంభించిన పిఒ.

పాడేరు టౌన్: ఐటిడిఎ కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం కార్నివాల్ ను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ జెండా ఊపి ప్రారంభించారు. కార్నివాల్ ఐటిడిఎ నుండి ఆర్‌టిసి కాంప్లెక్స్, సినిమా హాల్ సెంటర్, పాత పెట్రోల్ బంక్, అంబేద్కర్ కూడలి మీదుగా అమ్మవారి దేవాలయం వరకు సాగింది. పిఒ వి.అభిషేక్, ఎఎస్‌పి.ధీరజ్ కునుబిల్లి, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ కార్నివాల్ ప్రదర్శనలోని డోలు, కొమ్ములున్న కిరీటాలను ధరించి ప్రదర్శన చేసి ఉత్సాహపరిచారు. ఐటిడిఎ ఎపిఒలు వివిఎస్.ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, టిడబ్ల్యూ డిడి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



భారీగా తరలి వచ్చిన భక్తులు

ప్రభుత్వ స్టాళ్లు ప్రదర్శన

మూడు రోజుల మోదకొండమ్మ ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యక్రమాలు, పథకాలపై ప్రజల్లో అవగాహనకు అధికారులు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

మోదకొండమ్మ ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.